
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5

వనపర్తి
జిల్లా వార్తలు
బుధవారం 27 ఆగస్టు 2025

మహిళపై విచక్షణా రహితంగా దాడి
- పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

6

విద్యార్థికి డెంగీ పాజిటివ్
- స్పందించిన వైద్య శాఖ అధికారులు
- కొంకనివానిపల్లిలో పర్యటన


వనపర్తి పట్టణంలోని గ్రీన్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం


కాడెద్దుల ఊరేగింపుతో గణేషుడిని తీసుకొస్తున్న అయిజ కమతంపేట యువకులు

జైజై గణేశా!

నేటి నుంచి వినాయక నవరాత్రులు

- ముస్తాబైన మండపాలు, గ్రామాలకు తరలిన ప్రతిమలు
- విగ్రహాల కొనుగోళ్లతో సందడిగా మారిన పట్టణాలు
- షోలాపూర్ నుంచి విగ్రహాలను తెప్పిస్తున్న నిర్వాహకులు
- గతంకంటే రెండింతలైన ధరలు
- మట్టి విగ్రహాలపై మక్కువ చూపుతున్న ప్రజలు


అచ్చంపేటలో గణనాథుడిని తీసుకెళ్తున్న యువకులు

కందనూలు/కొల్లాపూర్/వనపర్తి రాజీవ్‌చౌరస్తా/గద్వాలటౌన్/అచ్చంపేట టౌన్/అయిజ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. వీధివీధినా గణపయ్యను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాల అలంకరణకు లక్షలు ఖర్చు చేస్తున్నారు. వేడుకలకు ఒకరోజు ముందుగానే గణనాథులను మండపాలకు తరలిస్తున్నారు. చిరు వ్యాపారులు వేడుకలకు అవసరమైన పూలు, పండ్లు, వనం విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, యువజన సంఘాల నాయకులు, భజన మండలి సభ్యులు వినాయకుడి మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో మంగళవారం వీర శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండపాన్ని సుందరంగా అలంకరించారు. నాగర్‌కర్నూల్ అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో విభిన్న రూపాలతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను భక్తులు కొనుగోలు చేసి మండపా లకు తరలిస్తున్నారు. గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని కమతంపేట వీధికి చెందిన భక్తులు కాడెద్దుల ఊరేగింపుతో గణనాథుడి విగ్రహాన్ని తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ధరలకు రెక్కలు...

వినాయక విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. పీవోపీతో తయారు చేసిన విగ్రహాల ధరలు రెట్టింపయ్యాయి. రంగులు, ముడి సరకులు, తదితర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో అదేస్థాయిలో విగ్రహాల ధరలను పెంచారు. 10నుంచి 15 అడుగుల విగ్రహాలు రూ.35 వేల నుంచి రూ.45 వేలు చెబుతున్నారు. 8 అడుగుల విగ్రహాలు రూ.20 వేలు, 5 అడుగుల విగ్రహాలు రూ.5వేల నుంచి వేల వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా తయారు చేసే విగ్రహాలే కాకుండా సోలాపూర్ నుంచి తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సందడిగా మార్కెట్లు

వినాయక చవితి నేపథ్యంలో పట్టణంలో మార్కెట్‌లు ప్రజలతో సందడిగా మారాయి. పట్టణాల్లో మంగళవారమే పండుగ సందడి మొదలైంది. విగ్రహాల కొనుగోళ్లతో పాటు, పూలు, పండ్లు, విక్రయాలు జోరుగాసాగాయి. పూజకు అవసరమయ్యే వనం, పండ్లకు డిమాండ్ పెరిగింది.



నాగర్‌కర్నూల్ పట్టణంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం


గద్వాలలో విక్రయానికి ఉంచిన వనం

యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందొద్దు
- కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలు దృష్టి సారించాలి
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు


పాలమూరు కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతో యూరియాపై మంత్రి సమీక్ష చేశారు. జిల్లాల వారీగా ఎంత వస్తుంది?, ఎంత అవసరమని అడిగారు. కలెక్టర్లు జిల్లాల వారీగా పంటల సాగు అంచనా, సాగు వివరాలు, యూరియా ఇండెంట్, స్టాక్, సరఫరా గురించి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. యూరియా సరఫరాలో అవకతవకలు జరిగినా,

(మిగతా 6లో..)

జోరుగా.. ఎన్‌హెచ్ 167కే పనులు

- రూ.547 కోట్లతో 79.3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం
- ఇప్పటికే పూర్తైన 49.8కిలో మీటర్ల రహదారి
- దుందుభీ నదిపై మేజర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ప్రయాణికులు


సుద్దకల్-వేపూర్ మధ్య దుందుభీ నదిపై పూర్తైన హైలెవల్ వంతెన

కల్వకుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 167కే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రూ.547కోట్లతో చేపట్టిన ఈ జాతీయ రహదారి పనులు రూ.401కోట్లు రోడ్డు నిర్మాణానికి, రూ.146కోట్లు భూసేకరణకు ప్రభుత్వం కేటాయించింది. జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆర్‌కే ఐపీఎల్ సంస్థ పనులను దక్కించుకుంది. కొత్త గేటు నుంచి కొల్లాపూర్ వరకు 79.3కిలో మీటర్ల నిర్మాణానికిగాను 106.743 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా అందులో 77.536 హెక్టార్ల భూ సేకరణ చేశారు. ఇంకా 29.207హెక్టార్ల భూసేకరణ పెండింగ్‌లో ఉంది.

కొత్త గేటు నుంచి కొల్లాపూర్..

కొత్త గేటు నుంచి కొల్లాపూర్ వరకు 79.3కిలో మీటర్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా 61.52కిలో మీటర్ల మొదటి లేయర్ డీబీఎం(డెన్స్ బిట్యుస్ మెకడమ్)కాగా అందులో సెకండ్ లేయర్ బీసీ (బిటమినస్ కాంక్రీట్)49.8కిలో మీటర్ల రోడ్డు పూర్తైంది. దీంతో జాతీయ రహదారిపై దాదాపు బీటీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావస్తుండగా కల్వకుర్తి వద్ద రెండుచోట్ల కోర్టు కేసులతో కొంత భాగం అసంపూర్తిగా మిగిలింది.

నాలుగు వీయూపీ (వెహికిలర్ అండర్‌పాస్‌లు)

ఎన్‌హెచ్ 167కేలో భాగంగా నాలుగు వీయూపీ అండర్‌పాస్‌లను నిర్మించాల్సి ఉంది. అందులో కల్వకుర్తి సమీపంలో పూర్తి కాగా కొల్లాపూర్ వద్ద రెండు ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయ సమీపంలో వీయూపీ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

ఈ ఏడాదిలో పనులు పూర్తి చేస్తాం



కొత్త గేటు నుంచి కొల్లాపూర్ వరకు జాతీయ రహదారి 167కేను ఒక సంవత్సరంలో పూర్తి చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు అవార్డ్ సిద్ధం చేశాము. కోర్టు కేసు కూడా త్వరలోనే పరిష్కారం కానుంది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

- పోల సురేందర్, ఎన్‌హెచ్ కల్వకుర్తి ఈఈ,

రెండు మేజర్ బ్రిడ్జిలలో ఒకటి పూర్తి

167కేలో భాగంగా రెండు మేజర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా అందులో సుద్దకల్, మేడిపూర్ గ్రామాల మధ్య దుందుభీ నదిపై మేజర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైంది. తాడూరు, గగ్గలపల్లి వద్ద మేజర్ బ్రిడ్జి నిర్మాణం ఇంకా పనులు ప్రారంభం కాలేదు. 45 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా అందులో 32 పూర్తయ్యాయి. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. మైనర్ బ్రిడ్జిలు 10 నిర్మించాల్సి ఉండగా అందులో 7పూర్తయ్యాయి. 3 పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌లో 29.207 హెక్టార్ల భూసేకరణ

నేషనల్ హైవే 167కేలో 29.207హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది. అందులో నాగర్‌కర్నూల్ బైపాస్ వద్దనే 28.13హెక్టార్లు పెండింగ్‌లో ఉండగా అవార్డ్ ప్రాసెస్‌లో ఉంది. కొల్లాపూర్ వద్ద 1.128 హెక్టార్లు పెండింగ్‌లో ఉండగా ఆ భూమికి అవార్డ్ చేస్తున్నారు.

వేగంగా.. సులభంగా

- డ్రోన్ల సాయంతో పంటలకు పురుగు మందులు
- 5 నిమిషాల్లో ఎకరం భూమిలో పిచికారి
- రైతులకు తగ్గుతున్న కూలీల ఖర్చు
- ఉపాధి పొందుతున్న యువత

6



పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


మొక్కను నాటి మట్టి పోస్తున్న ఎమ్మెల్యే

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కలు పెంచుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతీ ఒక్కరు కనీసం పది మందికి మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి కేఏవీఎస్ ప్రసాద్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగరావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్ తదితరులు ఉన్నారు.

అవసరం మేరకే యూరియా

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


నాగవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న అధికారులు

వనపర్తిరూరల్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరం మేరకే యూరియా ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని నాగవరం పీఏసీఎస్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. యూరియా నిల్వ ఎంత ఉంది? రైతులకు ఎంత మేర సరఫరా చేస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా కోసం వచ్చే రైతులకు ఎకరానికి కేవలం ఒక బస్తా మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, ఇతర అధికారులు ఉన్నారు.

యూరియా కష్టాలు

- పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
- వారం రోజులుగా మారని తీరు
- విసిగివేసారి ఆందోళన బాట

7

'ఎలుకల బెడద'పై కలెక్టర్ సీరియస్

- ప్రిన్సిపాల్‌ను పిలిపించి వివరాలు ఆరా
- తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- 'ఎక్స్'లో స్పందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు


లబ్ధిదారులను డిప్పు ద్వారా ఎంపిక చేస్తున్న ఏడీవో ఉపేంద్ర

అలంపూర్ చేనేత క్లస్టర్ లబ్ధిదారుల ఎంపిక

- డిప్పు పద్ధతిలో 216 మందిని ఎంపిక చేసిన ఏడీవో ఉపేంద్ర

6

తాడోపేడో తేల్చుకుందాం

- మహా గర్జన సన్నాహక సమావేశంలో మందకృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కల్వకుర్తి/అచ్చంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లను పెంచుడో, రేవంత్ సర్కార్ వైదొలుగుడో సెప్టెంబరు 9న తేల్చుకుందామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, అచ్చంపేట పట్టణాల్లో ఏర్పాటు చేసిన మహాగర్జన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చి 20 నెలలు అయినా అమలు చేయడం లేదని అన్నారు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యాడని విమర్శించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తాను పింఛన్ల పెంపు కోసమే పోరాటం చేస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, కండరాల క్షీణత వారికి రూ.15వేలు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జనకు లక్షలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కల్వకుర్తి దివ్యాంగుల సంఘం నాయకుడు సాజిద్, ఎమ్మార్పీఎస్ నాయకులు విష్ణు, రాజు, అచ్చంపేట దివ్యాంగుల సంఘం నాయకులు మోతిలాల్, తిరుపతమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం శ్రీజ అభిమతం



- పల్లీ పొట్టు, కాగితపు గుజ్జుతో వినాయక విగ్రహాలు
- పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి
- గ్రీన్ గెలాక్సీ పేరుతో స్టార్టప్ పరిశ్రమ
- పూల కుండీలు, టీ గ్లాసుల తయారీ

7

ఆర్‌ఎంపీ కేంద్రం సీజ్

- వచ్చీ.. రాని వైద్యం చేస్తే చర్యలు - డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప



అరవింద్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

గద్వాల క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో వచ్చిరాని వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ కేంద్రాలను సీజ్ చేస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప తెలిపారు. 'ప్రాణాలతో చెలగాటం' అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో స్పందించారు. సోమ, మంగళవారాలు ఆర్‌ఎంపీ కేంద్రాలను తనిఖీలు చేశారు. అందులో భాగంగా మంగళవారం గద్వాల పట్టణంలోని సుంకులమ్మ సమీపంలో ఉన్న అరవింద్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనారాణి, జిల్లా వైద్య సిబ్బంది సీజ్ చేశారు. సోమవారం అయిజ మండలంలోని వెంకటాపురంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మధుసూధన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

29న ఉమ్మడి జిల్లా సైక్లింగ్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం

మక్తల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14, 16, 18 ఏళ్ల బాలబాలికలకు ఐదు కిలోమీటర్ల సైక్లింగ్ (మట్టిరోడ్డు) పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అలాగే సైకిల్ ర్యాలీ కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పీఈటీలు రమేశ్‌కుమార్, అంబ్రేష్, దామోదర్ పాల్గొన్నారు.

అలంపూర్ చేనేత క్లస్టర్

లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న చేనేత కార్మికులు

రాజోలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలిలోని అంబా భవాని ఫంక్షన్‌హాల్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య ఆదేశాల మేరకు ఏడీఓ ఉపేంద్ర మంగళవారం అలంపూర్ చేనేత క్లస్టర్ పథకం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అలంపూర్ క్లస్టర్ పథకంలో మొత్తం 413 మంది సభ్యులు ఉన్నారని, వారిలో క్లస్టర్ 2016 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని వీరికి లిఫ్ట్ వీవింగ్ మిషన్స్‌ను 90శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. అలంపూర్ చేనేత క్లస్టర్‌లో ఎక్కువ శాతం రాజోలి చేనేత కార్మికులు ఉండటం వల్ల రాజోలి మండల కేంద్రంలోనే ఎపిక కార్యక్రమం నిర్వహించామని, డిప్పు పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ సీడీఈ శివమణి, చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి డి. శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, అలంపూర్, ప్రాగటూరు. కోర్విపాడు, రాజోలికి చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



లావణ్యా రమణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

తెలకపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రతీమంగళవారం చేపడు తున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం మండలంలోని కారువంగ గ్రామంలో సేంద్రియ సాగులో నిష్ణాతులైన లావణ్యరమణారెడ్డి వ్యవసాయ క్షేత్రం నుంచి ప్రత్యేక ప్రసారం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆమె సేంద్రియ సాగులో చేపడుతున్న విధానాల గురించి అదే విధంగా నేల, పర్యావరణం, పరిరక్షణతో పాటుగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధానాలను వివరించారు. కార్యక్రమాన్ని సీనియర్ సైంటిస్ట్, ఆగ్రోనమిస్ట్ సుధారాణి, కేవీప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీదేవి, ఎంటమో లాజిస్ట్ శైల, మండల వ్యవసాయాధికారి పి. నర్మద, విస్తరణ అధికారులు విజయ్‌కుమార్, సంతోష్, అన్వర్‌పాషా, రమణారెడ్డి పాల్గొన్నారు.

● తాడూరు : వటీవల అదిక వర్షాలకు ప త్తి పంటకు తేమ శాతం ఎక్కువై అనేక రకాల చీడపీడలు ఆశిస్తున్నాయని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చైతన్య తెలిపారు. అన్నదాత లు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామమైన ఇంద్రకల్ గ్రామానికి వచ్చి రైతుల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.చైతన్య, డాక్టర్ కే.సదయ్య, మాధురి, మండల వ్యవసాయ అధికారి సందీప్‌రెడ్డి, విస్తరణాధికారులు శ్రీకాంత్, కార్తీక్, రావేఫ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దొంగతనాలకు

పాల్పడుతున్న నిందితుడికి రిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాంలాల్

మక్తల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టపగలు రెక్కీ నిర్వహించి రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్న ఎరుకల ప్రశాంత్ అలియాస్ శ్రీనివాస్ అనే నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంలాల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడుపల్లి గ్రామానికి చెందిన ఎరుకల ప్రశాంత్ అలియాస్ శ్రీనివాస్(32) అనే యువకుడు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. తనకు వచ్చే కూలి డబ్బులు సరిపోవని దొంగతనం చేసి డబ్బులు సంపాదించాలనుకున్నాడు. జూలై 11న అర్ధరాత్రి భూతప్పూర్ పవన్‌కుమార్ ఇంట్లో చొరబడి బంగారు, వెండి వస్తువులు, రూ.30వేల నగదు దొంగతనం చేశాడు. అలాగే జనవరి 22న పుట్టపల్లి అనిత ఇంట్లో చొరబడి రూ.52 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడన్నారు. మక్తల్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని విచారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో, ఇతర ప్రాంతాల్లో మొత్తం 13 దొంగతనాలు చేసినట్లు తెలిపాడు. మక్తల్‌లో చోరీకి సంబంధించి 59 గ్రామాల బంగారు ఆభరణాలు, 29 తులాల వెండి ఆభరణాలు రూ.5.20 లక్షలు ఉంటుందన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్ఐ శంకరయ్య, కానిస్టేబుల్ అశోక్, శ్రీకాంత్, నరేష్‌లను సీఐ అభినందించారు.

వేగంగా.. సులభంగా...

- డ్రోన్ల సాయంతో పంటలకు పురుగు మందులు
- 5 నిమిషాల్లో ఎకరం భూమిలో పిచికారి
- రైతులకు తగ్గుతున్న కూలీల ఖర్చు
- ఉపాధి పొందుతున్న యువత



పంట పొలాల్లో ఎరువుల మందు పిచికారి చేయడానికి సిద్ధంగా ఉన్న డ్రోన్



పంట పొలాల్లో డ్రోన్ పిచికారిని రిమోట్‌తో పర్యవేక్షిస్తున్న డ్రోన్ ఆపరేటర్

ఖిల్లాఘణపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యాంత్రీకరణతో వ్యవసాయరంగం కొత్తపుంతలు తొక్కుతున్నది. సంప్రదాయ పద్ధతులకు ప్రత్యామ్నాయంగా యంత్రాలను వినియోగిస్తూ పొలం పనులను త్వరగా, సులభంగా పూర్తి చేసుకుంటున్నారు. పొలం దున్నేందుకు, కరిగెట చేసేందుకు రైతులు కాడెద్దులుగా బదులుగా ట్రాక్టర్లను ఎప్పటి నుంచో వినియోగిస్తున్నారు. అలాగే వరి నాట్లు వేయడంతో పాటు, పంటలో కలుపు తీసేందుకు కూడా యంత్రాలను వినియోగిస్తున్నారు. సస్యరక్షణ చర్యలకు, చీడ పీడలను కాపాడుకునేందుకు రైతులు పురుగుమందులు, రసాయనిక ఎరువులను పిచికారి చేయాల్సి ఉంటుంది. అందుకు ఎక్కువ సమయం పడుతుంది. దీనికి తోడు కూలీల కొరత కూడా రైతులను ఇబ్బంది పెడుతోంది.

పెరిగిన డ్రోన్ల వినియోగం

ఇప్పటివరకు వివిధ పనులకు విస్తృతంగా వినియోగిస్తున్న డ్రోన్లు, ఇప్పుడు వ్యవసాయరంగం లోనూ కీలకంగా మారాయి. పంటలపై రసాయనిక ఎరువులు, పురుగుమందులను పిచికారీ చేసేందుకు వీటిని వినియోగిస్తున్నారు. తద్వారా రైతులకు పని భారం తగ్గడంతో పాటు, కూలీల అవసరం తక్కువవుతోంది. అది కూడా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేసేందుకు వీలు కలుగుతోంది. బ్యాటరీలతో నడిచే ఈ డ్రోన్ సాయంతో వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంటలకు సరిపడా మందులను పిచికారి చేస్తున్నారు. అయితే ఆ సమయంలో విద్యుత్ తీగలు, చెట్లకు తగులకుండా ఆపరేటర్ రిమోట్ ద్వారా డ్రోన్‌ను నడిపిస్తాడు. వీటి ద్వారా రసాయనిక ఎరువులైనా, పురుగు మందులైనా పంట పొలాల్లో సమపాళ్లలో పిచికారి చేసే అవకాశం ఉంటుంది. కొందరు రైతులులు పంటల పర్యవేక్షణకు కూడా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు.

ఎకరం పొలంలో పిచికారికి రూ.500

ప్రస్తుతం డ్రోన్ల వినియోగం పెరగడంతో పలువురు యువకులు వీటిపై దృష్టి సారిస్తున్నారు. డ్రోన్లను కొనుగోలు చేసి, ఆపరేటింగ్ నేర్చుకొని ఉపాధి పొందుతున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో 7 డ్రోన్లు ఉన్నాయి. వాటిని పొలాలకు తీసుకెళ్లడం, బ్యాటరీల రీచార్జింగ్, ఆపరేటింగ్ పనులు చేస్తూ దాదాపు 20 మంది యువకులు ఉపాధి పొందుతున్నారు. ఎకరం భూమిలోని పంటకు రూ.500 తీసుకుని, కేవలం 5 నిమిషాల్లో పురుగుల మందు పిచికారి పూర్తి చేస్తున్నారు. ఒక రోజుకు 10 నుంచి 20 ఎకరాల పొలంలో క్రిమిసంహారక మందుల పిచికారి పూర్తవుతోంది. సీజన్‌లో ఒక్కో డ్రోన్ ద్వారా ప్రతీనెల రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు వరి పంటల కలుపు మొక్కల నివారణకు కూడా డ్రోన్లనే వినియోగిస్తున్నారు. తద్వారా సమయం ఆదా కావడంతో పాటు, రైతులకు ఆర్థిక భారం తగ్గుతోంది.

జాగ్రత్తలు పాటించాలి



డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులను పిచికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. పిచికారి చేసే క్రమంలో పక్క పంటలోకి డ్రోన్ వెళ్తే నష్టం వాటిల్లుతుంది. డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ చేయించడం రైతుకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చు.

- శివారెడ్డి, రైతు, పర్వతాపూర్

స్వయం ఉపాధితో జీవనోపాధి

స్వయం ఉపాధి కోసం రూ.6 లక్షలు వెచ్చించి డ్రోన్ కొనుగోలు చేశాను. పరిసర గ్రామాల్లో పంటలకు పురుగుమందులను పిచికారీ చేస్తున్నాను. సీజన్లో ఒక్కో రోజు 15 నుంచి 20 ఎకరాల్లో పంటలకు పిచికారి చేస్తుండటం లాభదాయకంగా ఉంది. డ్రోన్ ద్వారా నేను నేను ఉపాధి పొందడంతో పాటు, మరో ఇద్దరికి పని కల్పిస్తున్నాను.

- మల్లేష్, డ్రోన్ యజమాని, షాపూర్

సీఎంఆర్ సకాలంలో అప్పగించాలి

- వనపర్తి అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్
- ఖిల్లాఘణపురంలోని రైసుమిల్లుల తనిఖీ



ఖిల్లాఘణపురం శ్రీరామ రైస్ మిల్లులో జిల్లా అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్

ఖిల్లాఘణపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సకాలంలో అప్పగించాలని వనపర్తి అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ రైస్‌మిల్లుల యజమానులను ఆదేశించారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర ఇండస్ట్రీస్, శ్రీనివాస ఇండస్ట్రీస్, శ్రీరామ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద మిల్లింగ్ ప్రక్రియను, బియ్యం నాణ్యతా ప్రమాణాలను, సీఎంఆర్ అప్పగింత పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి నిర్దేశించిన గడువు లోగా పౌర సరఫరాల శాఖకు అప్పగించాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా మేనేజర్ జగన్మోహన్, సివిల్ సప్లయ్ డీటీ పరమేశ్ పాల్గొన్నారు.

భూగ్రహం కాపాడుకుంటేనే మానవ జాతికి మనుగడ



మీర్జాపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం షణ్ముఖచారి

కోస్గి రూరల్/నారాయణపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భూగ్రహాన్ని కాపాడుకుంటేనే జీవజాతికి మనుగడ ఉంటుందని హరిత విప్లవ మండలి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాబార్డ్ డీడీఎం షణ్ముఖచారి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండల పరిధిలోని మీర్జాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ, సీజీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మెడిసినల్ గార్డెన్, ఇంకుడు గుంతలు, కంపోస్టు పిట్లు, కిచెన్ గార్డెన్‌లను ప్రారంభించారు. అటవీశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్, హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, ఎర్త్ క్లబ్ సమన్వయకర్త వార్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, పేట మండలం జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్(సీజీఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సంస్థ చైర్మన్ లీలారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం షణ్ముఖచారి ప్రారంభించారు. విద్యార్థులు వర్షపు నీటి సంరక్షణ, ఔషధ తోటలు, వంటింటి తోటలు, వృక్షారోపణ వంటి అంశాలపై ప్రదర్శనలు ఇస్తూ పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రీన్ ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎం భారతి, జిల్లా సైన్స్ అధికారి హెచ్.భానుప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై విచక్షణారహితంగా దాడి

- పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు



దాడిలో గాయపడ్డ మహిళ సుధ

గద్వాల క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ మహిళపై ఓ పోలీసు అధికారి కుటుంబ సభ్యులు విచక్షణారహితంగా దాడి చేశారు. సంఘటనకు సంబంధించి బాధితురాలు సుధ, ఆమె భర్త అనిల్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుధ ఇంటి పక్కన ఓ పోలీస్ అధికారి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. గతంలో వారి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అదే క్రమంలో మంగళవారం మరో సారి గొడవ జరిగింది. సుధపై పోలీస్ అధికారి కుటుంబ సభ్యులు శారద, కార్తీకర్, రవితేజ, ప్రియాంకలు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆమె తలకు, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి భర్త అనిల్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి బాధితురాలిని పరామర్శించి, దాడిని ఖండించారు. అయితే పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో రాత్రి 10 గంటల సమయంలో స్థానికులు కాలనీలో ధర్నా చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు బయలుదేరారు.

తాగుబోతు వీరంగం

జడ్చర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్‌ను లీక్ చేసి నిప్పంటించేందుకు యత్నిస్తూ ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిపి పాలిటీలోని ఎర్రగుట్ట వద్ద జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... ఎర్రగుట్ట వద్దనున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సప్పడి సంజన, మామిళ్ల కళావతి, నవనీత, బాలమణి కుటుంబసభ్యులతో నివసిస్తున్నారు. అక్కడే నీరటి వెంకట్రాములు, ఎల్లమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వెంకట్రాములు ప్రతీ రోజు మద్యం తాగి, భార్య ఎల్లమ్మతో పాటు పిల్లలను వేధిస్తూ కట్టేవాడు. ఆ సమయంలో సంజన, కళావతి, నవనీత, బాలమణి వారిని సముదాయించి విడిపించేవారు. తన భార్యను కొడుతుంటే ఎందుకు అడ్డం వస్తారంటూ సోమవారం సాయంత్రం సంజ నపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. అడ్డుకోబోయిన కళావతి, నవీనత, బాలమణిలపై కూడా అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన వెంకట్రాములు మంగళవారం సాయంత్రం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయంలోకి గ్యాస్ సిలిండర్‌ను తీసుకొచ్చాడు.

అందరినీ చంపేస్తానని బెదిరిస్తూ గ్యాస్ లీక్ చేసి నిప్పంటించేందుకు యత్నించాడు. గ్యాస్ వాసన రావడంతో అక్కడ నివసించే వారందరూ భయపడి భవనాన్ని వదిలి దూరంగా వెళ్లిపోయారు. అనంతరం బాధితురాలు సంజన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

యూరియా కొరత లేదు

(5వ పేజీ తరువాయి)

దాచిపెట్టినా, కృత్రిమ కొరత సృష్టించినా ఆ డీలర్లపై, నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక ధరలకు అమ్మిన వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. కేంద్రం నుంచి 9 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని, అది వస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రైతులు ఇబ్బంది పడొద్దనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులతో మాట్లాడి యూరియా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. వ్యవసాయ సీజన్ ముగిసేవరకు ప్రతీ ఎరువుల దుకాణం, పీఏసీఎస్ ఆగ్రో సేవా కేంద్రాల వద్ద ఒక్కో షాపునకు ఒక అధికారిని నియమించి యూరియా పంపిణీ బాధ్యత వారికి అప్పగించాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని ఒక మండలంలోని ఒక గ్రామానికి తీసుకుని యూరియా పంపిణీ చేసేలా ప్రయోగాత్మకంగా చూడాలన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి దేవరకద్ర, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యూరియాను కొనుగోలు చేస్తారని, నియోజకవర్గానికి యూరియాను అధికంగా కేటాయించాలని కోరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో వరిసాగు మిగతా నియోజక వర్గాలతో పోలిస్తే రైతులు నార్లు ఎక్కువ పోసుకున్నారని, రైతులు యూరియా ఎక్కువగా కొని నిల్వ చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందొద్దని, అవసరమైన మేర సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. చ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లు యూరియాను దాచి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చెప్పారు.

తర్వాత రేటు పెంచి అమ్ముతున్నారని అన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ యూరియా సరఫరాలో లోడు సమయానికి రావడం లేదని, సమయానికి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాను అధికారులు పర్యవేక్షించి సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వెల్దండ, ఊర్కొండ మండలాలకు యూరియా ఎక్కువ సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్ గౌతమ్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, వనపర్తి కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీయూ భూములు కాపాడుకుందాం

- విద్యార్థి సంఘాల నాయకులు



పీయూ గేటు ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని భూములు కాపాడుకోవాలని మంగళవారం విద్యార్థి సంఘాల నాయకులు పీయూ గేటు ఎదురుగా ధర్నా చేపట్టారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకై 500 గజాల భూమిని కేటాయించారని, కానీ విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకై అక్రమంగా ఎకర భూమి వరకు విస్తరణ చేశారని, విద్యుత్ అధికారులను నిలదీయగా పీయూ అధికారులే మాకు ఎకరం భూమిని కేటాయించారని తెలిపారు. ఇరువురు అధికారుల మాటల మధ్య పొంతన లేకపోవడంతో యూనివర్సిటీ భూములు ఎటుపోతున్నాయో తెలియజేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం పీయూ పరిపాన భవనం ఎదుట ధర్నా చేపట్టగా, పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు సానుకూలంగా స్పందించారు. సబ్‌స్టేషన్ కోసం 500 గజాల భూమిని మాత్రమే ఇవ్వడం జరిగిందని మిగతాది విద్యుత్ అధికారులు ఆక్రమించారని, సబ్‌స్టేషన్ వారికి నోటీసులు జారీ చేశామని, ఆక్రమనకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, ఎంఎస్ఎఫ్ పీయూ అధ్యక్షుడు గణేష్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు రాము, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప పాల్గొన్నారు.

ఎల్‌వోసీఎఫ్ ముసాయిదాను రద్దు చేయాలి



పీయూ పీజీ కళాశాల ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల యూజీసీ విడుదల చేసిన లర్నింగ్ అవుట్ కమ్ కరికులం ఫ్రేమ్‌వర్క్ ముసాయిదాను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు బత్తిని రాము డిమాండ్ చేశారు. మంగళవారం పీయూ పీజీ కళాశాల ఆవరణలో జాతీయ ఎఫ్ఎస్ఐ పిలుపు మే రకు నిరసన చేపట్టి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా కరికులం, విద్యా విధానం ఉండాలని, వ్యక్తిగత సంస్థలు, సంఘాలకు అనుకూలంగా ఉండకూడద న్నారు. యూజీసీ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో సరస్వతీ వందనం ప్రారంభమవడం, కామర్స్ లో కౌటిల్య అర్థశాస్త్ర బోధన సూచన ఇవ్వడం, స్వాతంత్ర సంగ్రామ కోర్సులో వీన సావర్కర్ రచించిన ఇండియా వార్ ఆఫ్ ఇండిపెన్స్ పుస్తకాన్ని పాఠ్యాంశంలో చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటాన్ని వదిలి, దేశద్రోహులను మహిమాన్వితం చేసే ఆర్ఎస్ఎస్, బీజేపీ కథనాలను బలవంతంగా రుద్దడం విద్యార్థులను మోసం చేయడమే అన్నారు. అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రామ్‌చందర్, రమేష్, ఆంజనేయులు, శివ పాల్గొన్నారు.

విద్యార్థికి డెంగీ పాజిటివ్

- స్పందించిన వైద్య శాఖ అధికారులు
- కొంకనివానిపల్లిలో పర్యటన



రక్త నమూనాలను తీసుకుంటున్న వైద్యులు

అమరచింత, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమర చింత పరిధిలోని కొంక నివానిపల్లిలో ఓ విద్యార్థి డెంగీ బారిన పడ్డాడు. గ్రామానికి చెందిన వెంక టేశ్ కుమారుడు రుద్ర నాథ్ అమరచింతలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. అతడికి జ్వరం రావడంతో 23వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రక్త నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపించగా, పాజిటివ్ అని తేలింది. దీంతో యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్‌వో) జిల్లా బృందం గ్రామంలో పర్యటించింది. సభ్యులు గంధంరాజు, సత్యం, సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, మోహన్, డాక్టర్ నిఖిత, ఏఎన్‌ఎం శారద, ఆశా వర్కర్ నర్మద తదితరులు బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న 20 మందిని పరీక్షించి రక్త నమూనాలు తీసుకొని, జిల్లా ఆసుపత్రికి పంపించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

- ఐదుగురిపై కేసు నమోదు

మానవపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని అమరవాయి గ్రామంలో జరిగింది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని సుబాబుల్ తోటలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. దీంతో ఎస్ఐ చంద్రకాంత్, సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. వారి నుంచి రూ. 8770 స్వాధీనం చేసుకున్నారు. 5గురు నిందితులపై కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని వ్యక్తి మృతి

వెల్దండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ సమీపంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన ఆయిల జంగయ్యగౌడ్ (60) గ్రామంలో కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. సామాను తెచ్చేందుకు మంగళవారం ద్విచక్రవాహనంపై వెల్దండకు బయలుదేరాడు. హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై పెద్దాపూర్ గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొన్నది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు.

అడవి పంది ఢీకొని ఆటో బోల్తా

» ఒకరి మృతి, 8 మందికి గాయాలు,



ఆత్మకూరులో చికిత్స పొందుతున్న గాయపడ్డ వ్యక్తి

అమరచింత, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అడవి పందిని ఢీకొని ఆటో బోల్తా పడటంతో ఒకరు మృతి చెందారు. 8 మంది గాయపడ్డారు. జూరాల ప్రాజెక్టును సందర్శించుకొని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. ఆత్మకూరు సీఐ శివకుమార్, అమరచింత ఎస్ఐ స్వాతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మరికల్ మండలం ఎలిగండ్ల గ్రామానికి చెందిన 8 మంది యువకులు మంగళవారం సాయంత్రం ఆటోలో జూరాల ప్రాజెక్టుకు వచ్చారు. ప్రాజెక్టును సందర్శించిన అనంతరం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. వారు వస్తున్న ఆటోను చంద్రమడ్, మస్తిపూర్ గ్రామాల శివారులో అడవి పంది ఢీకొనడంతో బోల్తా పడింది. ప్రమాదంలో రమేశ్, రాము, శేఖర్, రమేశ్‌లతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో రమేశ్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. వైద్యుల సూచన మేరకు అతడిని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

» సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన జిల్లా వైద్యాధికారి

వంగూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరిన ఓ వ్యక్తికి జిల్లా వైద్యాధికారి సంఘటనా స్థలంలోనే సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. కల్వకుర్తి మండలంలోని జేపీ నగర్‌కు చెందిన యుగంధర్ స్కూటీపై అత్తగారి ఊరైన సర్వారెడ్డిపల్లి తండాకు బయలుదేరాడు. ఆరె మైసమ్మ ఆలయ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అదే సమయంలో వంగూరు నుంచి వస్తున్న జిల్లా వైద్యాధికారి అతడిని గమనించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రీససిటేషన్)చేశారు. దీంతో కొద్దిసేపటి తర్వాత బాధితుడు శ్వాస తీసుకోవడం ప్రారంభించడంతో అక్కడే ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి అత్యవసర వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సకాలంలో స్పందించి బాధితుడి ప్రాణాలు కాపాడిన వైద్యాధికారిని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న ట్రక్కు డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో, వెనుకే వస్తున్న బొలెరో దాన్ని ఢీకొన్నది. దీంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని అలంపూర్ చౌరస్తా సమీపంలో జరిగింది. 44వ జాతీయ రహదారిపై హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ ట్రక్కు హఠాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుకే వస్తున్న బొలెరో డ్రైవర్ హనుమంతప్ప వాహనాన్ని అదుపు చేయలేక ట్రక్కును ఢీకొన్నాడు. ప్రమాదంలో అతడితో పాటు, క్లీనర్ కంగాల్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిద్దరినీ కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఆశా కాలనీలో ఈ సంఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలానికి చెందిన చిన్న లింగయ్య అనే వ్యక్తి భార్య మేఘన, ఇద్దరు పిల్లలతో షాద్‌నగర్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలం నుంచి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. ఈ నెల 24న సొంతూరులోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి అందరూ వెళ్లారు. అదే రోజు సాయంత్రం భార్యకు చెప్పి షాద్‌నగర్‌కు వచ్చాడు. సోమవారం ఉదయం భార్య ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె పక్కింటి వారికి ఫోన్ చేసి చెప్పింది. వారు వెళ్లి చూడగా లింగయ్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించడంతో వెంటనే భార్యకు చెప్పారు. దీంతో ఆమె షాద్‌నగర్ చేరుకున్నారు. సంఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. పోలీసులు మంజునాథ నాయుడు, భాషా మంగళవారం బ్లూకోట్ విధులు నిర్వర్తి స్తుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్రంలోకి వస్తున్న ఇసుక లారీ కనిపించింది. అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు అనుమతులు లేకపోవడంతో లారీని స్టేషన్‌కు తరలించారు. ఓర్వకల్లుకు చెందిన కె.రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెయ్యి లీటర్ల డీజిల్ చోరీ



డీజిల్ ట్యాంకును చూపిస్తున్న డ్రైవర్లు

చారకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగి ఉన్న మూడు లారీల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు వెయ్యి లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. లారీ డ్రైవర్లు గోపి, సాగర్, రమేశ్‌లు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేటలోని వజ్రం రైస్‌మిల్లు నుంచి మూడు లారీల్లో వడ్లను లోడు చేసుకొని రాయచూరుకు బయలు దేరారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో డ్రైవర్లకు నిద్ర రావడంతో చారకొండ మండల కేంద్రంలోని జడ్చర్ల - కోదాడ రహదారి పక్కన లారీలను నిలిపి పడుకున్నారు. తెల్లవారు జామున 5 గంటలకు నిద్ర లేచి లారీ చక్రాలను పరిశీలిస్తుండగా, డీజిల్ ట్యాంకర్ల తాళాలు విరగ్గొట్టి కనిపించాయి. వాటిల్లోని దాదాపు 1000 లీటర్ల డీజిల్ మాయం అయ్యింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పర్యావరణ హితం.. శ్రీజ అభిమతం



వేరుశనగ పొట్టు, కాగితపు గుజ్జుతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు

» పల్లీ పొట్టు, కాగితపు గుజ్జుతో వినాయక విగ్రహాలు
» పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి
» గ్రీన్ గెలాక్సీ పేరుతో స్టార్టప్ పరిశ్రమ
» పూల కుండీలు, టీ గ్లాసుల తయారీ

గద్వాల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ హితమే ఆమె ప్రధాన ధ్యేయం. పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్న ఆమె పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించింది. వేరుశెనగ పొట్టు, కాగితపు గుజ్జుతో పూల కుండీలను తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది.

ఆమె పేరు శ్రీజ. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని వీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (సీఎస్ఈ) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వినాయకచవితిని పురస్కరించుకొని పర్యావరణ హిత గణపతి విగ్రహాలను తయారు చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది.

పాఠశాల స్థాయిలోనే జాతీయ గుర్తింపు

విద్యార్థిని శ్రీజ తన స్వగ్రామమైన చింతలకుంటలో ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసింది. ఆ సమయంలోనే పరిశోధనలపై దృష్టి సారించిది. వేరుశనగ పొట్టు, కాగితపు గుజ్జుతో పూల కుండీలు తయారు చేసి ప్రశంసలు అందుకున్నది. 2020లో నిర్వహించిన ఇన్నోవేషన్ కార్యక్రమంలో వాటిని ప్రదర్శించి జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. అదే స్ఫూర్తితో 'శ్రీజ గ్రీన్ గెలాక్సీ' పేరుతో స్టార్టప్ పరిశ్రమను ఏర్పాటు చేసింది. ఆమె పరిశోధనకు చేయూతనిచ్చిన అప్పటి సైన్స్ ఉపాధ్యాయుడు ఆగస్టీన్ ఆ పరిశ్రమ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థలో మరో ఇద్దరు యువకులకు కూడా ఉపాధి కల్పించారు. పర్యావరణ హితమైన పూల కుండీలు, టీ గ్లాసులను ఉత్పత్తి చేస్తున్న వారు ఈ సంవత్సరం వినాయక చవితిని పురస్కరించుకొని వినాయకుడి విగ్రహాలను కూడా తయారు చేస్తున్నారు.



వేరుశనగ పొట్టు, కాగితపు గుజ్జుతో చేసిన పూలకుండీలు

నీటిలో పూర్తిగా కరిగిపోయే విగ్రహాలు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్లాస్టిక్ పారిస్ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా వాటిని చెరువులు, నదులు, కాలువలు, బావుల్లో నిమజ్జనం చేస్తారు. కానీ అవి రసాయనిక మిశ్రమంతో చేసిన విగ్రహాలు కావడం వల్ల నీరు, పర్యావరణం కలుషితమవుతోంది. ఈ క్రమంలో శ్రీజ గ్రీన్ గెలాక్సీలో తయారైన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. ఆ విగ్రహాలను నిమజ్జనం చేసిన గంటలోనే అవి నీటిలో పూర్తిగా కరిగి పోతాయి. దీంతో పాటు జల చరాలకు ఆహారం కూడా అందుతుంది. నీరు కలుషితమయ్యే అవకాశమే ఉండదని సంస్థ పర్యవేక్షకుడు, సైన్స్ టీచర్ ఆగస్టీన్ తెలిపారు.

ప్రోత్సహిస్తే మరిన్ని ఉత్పత్తులు



ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే మరిన్ని ఉత్పత్తులను తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయింది. దీంతో పర్యావరణానికి హాని జరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణహితానికి పాటుపడే సంస్థలకు ప్రభుత్వ పరంగా తోడ్పాటు అవసరం. సరైన ప్రోత్సాహం అందిస్తే సంస్థను విస్తరించి ఉత్పత్తులను పెంచడం ద్వారా మరికొంత మంది యువతీ యువకులు ఉపాధి లభిస్తుంది.

- శ్రీజ, బీటెక్ విద్యార్థిని

యూరియా కష్టాలు



రాణిపేట గ్రామంలోని యూరియా బస్తాల కోసం ఎరువుల దుకాణం బారులు తీరిన రైతులు



భూత్పూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

» పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
» వారం రోజులుగా మారని తీరు
» విసిగివేసారి ఆందోళన బాట

భూత్పూర్/ నవాబ్‌పేట/ మూసాపేట/ తెలకపల్లి/ బిజినేపల్లి/ మిడ్జిల్/ గోపాల్‌పేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అరిగోస తప్పడం లేదు. కీలక సమయంలో పొలం పనులను వదిలి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. యూరియా ఇవ్వాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. పొద్దస్తమానం పడిగాపులు కాస్తున్నారు. విసిగి వేసారి ఆందోళన బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఇ దే పరిస్థితి కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, నవాబ్‌పేట, మిడ్జిల్, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, నా గర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి, బిజినేపల్లి కేంద్రాల్లో రైతులు ఆందోళన చేపట్టారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రంలోని చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. పలుకుబడి ఉన్నోళ్లకు లోలోపల ఇచ్చేస్తున్నారంటూ ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణ, ఏవో మురళీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లో రైతులకు అవసరమైన మేరకు యూరియా ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● నవాబ్‌పేట మండల కేంద్రంలోని ఎర్రసత్యం చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్ మోడెమోని నర్సింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, గండు చెన్నయ్య, ప్రతాప్, రాజునాయక్, అలి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి పీఏసీఎస్ ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు గడ్డమీది ఇంద్రయ్యసాగర్, బీఆర్‌యస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం సీఈవో భాస్కర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో నాయకులు పల్లి శివరాములు, నర్సింహులు గౌడ్, గూపని కొండయ్య, రవిందర్‌గౌడ్, మధు, లక్ష్మీనరసింహ, బాలయ్య, పెద్దవెంకటయ్య, మధు, ఆంజనేయులు, కాశీనాథ్, రాజు, కత్తి వెంకటేశ్, యాదయ్య, చంద్రయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని రాణిపేట పీఏసీఎస్ ముందు రైతులు అధికసంఖ్యలో బారులు తీరారు. పొలం పనులను వదిలిపెట్టి ఇక్కడ వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేశ్ రైతులను సముదాయించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణం ముందు యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అయితే ఉన్న యూరియాను అందరికీ సరిపోదని భావించి యజమాని దుకాణాన్ని మూసివేశారు. దీంతో రైతులు అక్కడే ధర్నా చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని శాంతిప చేశారు.

● వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణానికి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను వరుస క్రమంలో పంపించి అందిరికీ యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు.

'ఎలుకల బెడద'పై కలెక్టర్ సీరియస్

» ప్రిన్సిపాల్‌ను పిలిపించి వివరాలు ఆరా
» తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
» 'ఎక్స్'లో స్పందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గురుకులంలో ఎలుకల బెడ దపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ తీవ్రంగా స్పందించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణను పిలిపించి వివరణ కోరినట్లు తెలిసింది. అలంపూరు చౌరస్తాలోని అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకులంపై ఆరా తీశారు. ఎలుకల నివారణకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎలుకలు కరిచి గాయపడిన విద్యార్థులకు చికిత్స చేయించాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఇదే అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వంపై 'ఎక్స్'లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంపూర్ ఎంజేపీ హాస్టల్‌లో పిల్లలు ఎలుక కాట్లకు గురికావడం దారుణమన్నారు. 'మీ గురుకలాల బాట ఏమయ్యింది?, కల్తీ అహారం పెడితే జైలుకు పంపుతా అన్నమాటలు ఎమయ్యాయి..?' అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రచారం పేరిట తమాషా చేయడం కాదని, గురుకులాల్లో పాము కాట్లు, ఎలుకకాట్లు లేకుండా చూడాలని కోరారు. ఉన్నత స్థాయిలో సమీక్షించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

- 2.84 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా తగ్గిపోయింది. కర్ణాటకలో వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా నదికి వరద తగ్గింది. దీంతో మంగళవారం ప్రాజెక్టులోకి 2.84 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు అధికారులు ఐదు గేట్లను 10 ఫీట్ల ఎత్తు ఎత్తి 1,35,095 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 62,510 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.96 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 గేట్ల ద్వారా 1,55,862 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నదిపై ఉన్న సన్నతి బ్యారేజీ నుంచి 50 వేల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 2.72 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 24 గేట్లను ఎత్తి 2,51,578 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,703 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 8 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

గోపాల్‌పేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యం అయినట్లు గోపాల్‌పేట ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏదుల మండల కేంద్రానికి చెందిన ద్యావర రాముడు భార్య చంద్రకళ హైదరాబాద్‌కు వెళ్లి సోదరులకు రాఖీ కట్టి వస్తానని చెప్పి ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త రాముడు 13 వ తేదీన అత్తకు ఫోన్ చేసి, చంద్రకళను పంపించాలని కోరాడు. ఆమె ఇక్కడకు రాలేదని అత్త చెప్పడంతో రాముడు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా భార్య ఆచూకీ లభించలేదు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన దయ్యం మశమ్మ ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు మశమ్మ కొడుకు దయ్యం రాజు, చంద్రకళ భర్త రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

శాస్త్రీయ విద్యావిధానం కావాలి

» విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
» ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

కొల్లాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ విద్యావిధానం అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 'నూతన విద్యావిధానం రద్దు - శాస్త్రీయ విద్యావిధానం అమలు'పై రెండవ రోజు మంగళవారం నిర్వహించిన సెమినార్‌కు శ్రీజన్ భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నూతన విద్యా విధానం-2020ని అమలు చేస్తే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర బాలికల కన్వీనర్ పూజ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ శంకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కావ్య, నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ 2డే లీగ్‌లో పాలమూరు గెలుపు

» 218 పరుగుల తేడాతో విజయం
» 4 వికెట్లు తీసి రాణించిన ముఖీద్



గెలిచిన మహబూబ్‌నగర్ జట్టు



4 వికెట్లు తీసిన ముఖీద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2డే లీగ్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 218 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట రోజు బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 87.1 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయ్యింది. హైదరాబాద్‌లోని శంషాబాద్ కేసీఆర్-2 క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు 35.2 ఓవర్లలో 133 పరుగులకు కుప్పకూలింది.

జట్టులో వంశీ 39, విశాల్ 29 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో ముఖీద్ 4, శశాంక్ 3, కే. శ్రీకాంత్, జశ్వంత్ చేరో వికెట్ తీసి జట్టు విజయానికి కృషి చేశారు. 2డే లీగ్‌లో విజయం సాధించిన జిల్లా జట్టును క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

తల్లిపేరుపై మొక్కను నాటి పరిరక్షించుకుందాం

ఆత్మకూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తల్లి పేరుపై ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుదామని ఆత్మకూరు మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు పేర్కొన్నారు. ఏకో క్లబ్ ఇన్‌చార్జి నాగప్రియ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని బాలికల పాఠశాలలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు.

మొక్కల పంపిణీ

వంద రోజుల ప్రణాళిలో భాగంగా పట్టణ ప్రజలకు మంగళవారం కమిషనర్ మొక్కలను పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని వనపర్తి మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. వంద రోజుల ప్రణాళికలో అవగాహన కల్పించారు.

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక

కొత్తకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లి గ్రామ కోటిలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో మండల గౌడ కులస్తులు మంగళవారం సమావేశం నిర్వహించి మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా ఆనంద్‌గౌడ్, వెంకటన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరసింహగౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

స్త్రీ సాధికారతకు చదువే ఆయుధం

వనపర్తి విద్యావిభాగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తిలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య అధ్యక్షతన ఉమెన్స్ ఈక్వాలిటీ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... స్త్రీలు అనేక రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా సాధించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. సమాన ఓటు హక్కు ఉండగానే సరిపోదు అని, అన్ని రంగాలలో సమానత్వాన్ని సాధించాలని, స్త్రీ సాధికారత సాధించేందుకు చదువే ప్రధాన ఆయుధమన్నారు. శ్రీనివాస్, సుష్మ, రామరాజు, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఆత్మకూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాగు నుంచి రేచింతల గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల

అమరచింత , ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న చలో హైదరాబాద్ మహాధర్న వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఉద్యోగులు ఎంపీవో నరసింహయ్య, ఉద్యోగులు రాజు, హనుమంత్, శ్రీనివాసులు విడుదల చేశారు.

'హామీ అమలు చేయాలి'

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) జిల్లా అధ్యక్షుడు మకాం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కర్రెమ్మగుడి, చేయూత వృద్ధాశ్రమంలో వృద్ధులు, వికలాంగులతో మాట్లాడారు. గట్టయ్య, చెన్నకేశవులు, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే మేఘారెడ్డిని వనపర్తిలో తిరగనివ్వమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై వనపర్తి పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి అందజేసి మాట్లాడారు. పట్టణంలో రోడ్డు విస్తరణ సందర్భంగా ఇల్లు కోల్పోయిన బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు ప్రభుత్వం సహాయం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందలేదని అన్నారు.

అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామాలు : సీపీఎం

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, విలీన గ్రామాల అభివృద్ధిపై మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వనపర్తి మునిసిపాలిటీలో రాజనగరం, నాగవరం, శ్రీనివాసపురం, మర్రికుంట, నర్సింగాయపల్లి విలీన గ్రామాలు ఉన్నాయని, అదేవిధంగా పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మునిసిపాలిటీలో విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

మండపం ఏర్పాటుపై వివాదం

వనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద కొందరు అధికార పార్టీ హిందూ సంఘాల నాయకులు, యువకులు కలిసి ఐదు రోజుల కిందట వినాయకుడి మండపం ఏర్పాటు చేశారు. మండపంలో వినాయకుడి విగ్రహం తెచ్చి ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు మండపం ఏర్పాటుకు అనుమతి లేదని నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించారు. అన్ని వినాయకుడిల మాదిరిగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నామని నిర్వాహకులు పోలీసులకు తెలిపారు. అనంతరం హిందూ సంఘాల నాయకులు, యువత పెద్ద ఎత్తున పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. కొత్త స్థానంలో ఏర్పాటు చేసే మండపాల ఏర్పాటుకు వారం రోజుల ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు నిర్వాహకులకు సూచించి వివాదం సద్దుమనిగేలా చేశారు.

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన

- వే సైడ్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



వే సైడ్ మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం , ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన కొనసాగిస్తూ.. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో 1 కోటి 90 లక్షలతో నిర్మించిన వే సైడ్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్లో కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసి ఎమ్మెల్యే సందడి చేశారు. నూతనంగా నిర్మించిన వే సైడ్ మార్కెట్‌కు అంబేద్కర్ రైతు మార్కెట్ అని నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 23 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వే సైడ్ మార్కెట్‌తో కూరగాయల క్రయ విక్రయదారులకు ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు. మార్కెట్‌లో వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ వ్యాపారస్తులకు స్టాల్స్‌ను డిప్ పద్ధతిలో కేటాయిస్తామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో నియోజకవర్గంలో గుడిసె లేని గ్రామాలను నిర్మిస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 12 లక్షల 60వేల రూపాయలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య యాదవ్, రాములు నాయక్, విజయ్ కుమార్, సాయిచరణ్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ..

కొత్తకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో బోధనాభ్యాసన సామగ్రి మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ పాఠశాలల పేరుతో మౌలిక వసతులకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు 128 బోధన అభ్యాసన ఉపకరణాలు ప్రదర్శించారు.

- పట్టణంలోని 4, 5, 6వ వార్డుల్లో కోటి 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డాక్టర్ బాబు, బోయోజ్, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను నెలకొల్పాలి

- అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్



వనపర్తిలో మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకలను మాత్రమే నెలకొల్పాలని అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ సూచించారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ రాష్ట్ర కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్యతో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న వినాయక విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పర్యావరణానికి హాని కలిగించే రంగులతో తయారు చేసి అమ్ముతున్నారన్నారు. వాటిని పూజ అనంతరం నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కాలుష్యమై పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. బీసీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ సంస్థ ద్వారా వనపర్తి జిల్లా ప్రజలకు 2000 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఎస్ సురేష్, ఏవో భాను ప్రకాష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

వనపర్తి : గణేశ్ ఉత్సవాల కమిటీల నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాహకులు ఇతరులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో ఎలక్ట్రిషన్ వర్క్‌లకు సంబంధించి జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డుకు అడ్డంగా మండపాలు వేయడంతో వాహనదారులకు ఇబ్బందులు అవుతాయని దృష్టిలో ఉంచుకుని మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు పోలీసు అనుమతి తీసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సవాల్లో డీజేలు పెడితే చర్యలు

ఖిల్లాఘణపురం : వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలు పెడితే చర్యలు తప్పవని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. డీజే శబ్దాలతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి పోలీస్ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఎస్ఐ జయన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వీపనగండ్ల : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మండపాలకు చేరుతున్న గణపయ్యలు

గోపాల్‌పేట : మండలంలోని అన్ని గ్రామాల్లో గణేశ్ చవితి సంబురాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి ఏర్పాటకు మండపాలను సిద్ధం చేశారు. బుధవారం ఉదయం నుంచే గణేశ్ విగ్రహాలను పూజించుకోవచ్చని పూజరులు తెలిపారు. చిన్నరులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ చౌరస్తాలో పట్టణ ప్రజలకు మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మట్టి గణపతిని పూజించడంతో పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా పంచభూతాల ఆరాధన, ప్రకృతితో అనుబంధం, మానసిక ప్రశాంతత, వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.



వినాయకులను పంపిణీ చేస్తున్న శశిధర్

జాతీయ స్థాయి శిక్షణకు జిల్లా ఉపాధ్యక్షుడు



ఈశ్వరయ్య

వనపర్తి విద్యావిభాగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బెస్ట్ ప్రాక్టీస్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని మే నెలలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో జాతీయ స్థాయిలో ఉదయ్‌పూర్, రాజస్థాన్‌లో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి గోపాల్‌పేట మండలం ఏదుట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఎంపికయ్యారు. జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి పది మంది హాజరవుతున్నట్లు ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

- నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ.. తిష్ట వేసిన సమస్యకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవతో శాశ్వత పరిష్కారం దక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిర పార్కు వద్ద ప్రధాన రహదారిపై నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాత బస్టాండ్ నుంచి కొత్తకోటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారి అనేక ప్రమాదాలకు వేదికైందన్నారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే రూ.25 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం చేయించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ప్రకాష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రేవల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వపు నిర్లక్ష్యపు వైఖరి కారణంగా ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్న గ్రామస్థాయిలో సమస్యలు కుప్పలుగా ఉన్నాయని సర్పంచులు లేక కేంద్రం నుంచి నిధులు కూడా వెనుతిరిగి వెళ్తున్నాయని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యదర్శి మణివర్ధన్‌సాగర్ పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితుల గ్రామాలకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మండలాల్లో పర్యటించి ఫొటోలు దిగి ప్రజల ముందు హడావుడి చేసి వెళ్తున్నారు తప్పా.. క్షేత్రస్థాయిలో పనులు ఏవి జరగడం లేదన్నారు. స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. అజయ్‌గౌడ్, బాలునాయక్, రాము, తిరుపతి పాల్గొన్నారు.

దంచి కొట్టిన వర్షం



జిల్లా కేంద్రంలో జలమయమైన రోడ్డు

వనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో వర్షం దంచికొట్టింది. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గంట పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో జిల్లా కేంద్రంలోని రోడ్లు, డ్రైనేజీలు పొంగి పొర్లాయి. పొద్దస్తానం ఎండ ఉండి ఉన్నట్టుండి వర్షం పడడంతో పలువురు వ్యాపారస్తులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకుంటున్న నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమై ఉం డగా వర్షం రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కేఎల్ఐ కాలువ గండి పరిశీలన



గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రేవల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గుడిపల్లి రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన సాగునీటి ప్రధాన కాలువకు తలుపునూరు గ్రామ శివారులో డి-6 కాలువకు గండి పడింది. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా ఇరిగేషన్ డీఈ సుచరిత, ఏఈ వెంకన్న గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. కొంత మంది రైతులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, కాలువ పక్కన ఉన్న మట్టి మొత్తం తొలగించారన్నారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించిన తరువాత కూడా మళ్లీ ఆ భూమిని కలుపుకుంటున్నారని అన్నారు. వర్షం నీరు వెళ్లడానికి కాల్వకు రంధ్రం పెట్టడంతో ఇంత పెద్దగా గండి పడిందని.. ఇలా చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మూడు రోజులలో కాలువ సరి చేస్తామని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీపనగండ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవర్ధనగిరి, కల్వరాల గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. పెంటయ్య, దర్గేష్ కర్ణాకర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్ల కమీషన్ మంజూరు చేయాలి'

వీపనగండ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లకు పెండింగ్‌లో ఉన్న కమీషన్‌ను వెంటనే మంజూరు చేయాలని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బసవరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వరలక్ష్మికి వినతి పత్రం అందించారు. సుధాకర్‌రెడ్డి, దశరథన్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, రాజేష్ డీలర్లు ఉన్నారు.

నూతన కార్యదర్శికి సన్మానం

రేవల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) వనపర్తి బీజేపీ జిల్లా కమిటీ నూతన కార్యదర్శిగా ఎన్నికైన చెన్నారం గ్రామస్థుడు మనివర్ధన్‌సాగర్‌ని మంగళవారం రేవల్లి మండల బీజేపీ నాయకులు సన్మానించారు. జిల్లా కమిటీకి ఎన్నికైనందుకు మండల అధ్యక్షుడు బాలునాయక్, గంధం ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

ఎంఈవోకు వినతి

పెద్దమందడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని పెద్దమందడి మండల ఎంఈవో మంజులతకు తపస్ నాయకులు ఈశ్వర్, రవికుమార్, శశివర్ధన్ వినతి పత్రం అందజేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



కొత్తకోటలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రులకు జ్వరాలతో వచ్చే బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి డాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కొత్తకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గదులు, బెడ్స్, ల్యాబ్ పరకరాలు, మందుల స్టాక్ రూం, ఓపీ రికార్డును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్లతో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులతో వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. పౌష్టికాహారంతో బాధపడే పిల్లల సంఖ్య జీరో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఎన్ఐసీ హాల్‌లో జిల్లా సంక్షేమ శాఖ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా బాల్య వివాహాల నిర్మూలనపై చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు ఏ విధమైన జ్వరం కేసు వచ్చినా డెంగీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, ఈ విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శాఖ అధికారులతో డెంగీ సహా సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు.

ప్రతీ రోజు నివేదిక ఇవ్వాలి..

జిల్లాలోని ప్యాక్స్ సహా, అన్ని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా విక్రయాలకు సంబంధించి ప్రతీ రోజు నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

వనపర్తి రూరల్ : జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లోని రాజారాం ట్రేడర్స్ అనే ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పది రోజుల్లో పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

పెబ్బేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అదనపు గదుల నిర్మాణ పనులను పదిరోజుల్లో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు కాంట్రాక్టర్‌కు సూచించారు. కొన్ని నెలలుగా నత్తనడకన కొనసాగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. శిథిలావస్థలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు గదుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, రాజశేఖర్, రాజేష్ గౌడ్, కృష్ణ, విజయలక్ష్మి, కుమారి, రాజు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్రానికి పంపడం జరిగిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం గుజరాత్‌లో ముస్లింలను బీసీలో చేర్చి రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, అదేవిధంగా రాష్ట్రంలో అమలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. విష్ణు, చంద్రశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన



దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ... యూరియా విషయంలో రైతులను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెడుతుందని మండిపడ్డారు. పంటలకు సరిపడినంత ఎరువులు ఇవ్వకుండా ముఖ్యమంత్రి, మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రమేష్ గౌడ్, తిరుమల్, హేమంత్, చిట్యాల రాము పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకపోతున్నారు

- మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్ల చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎంతో దూరదృష్టితో నల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేస్తున్నారని, అందులో భాగంగానే చెరువు కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అతి త్వరలో చెరువు కట్టపై క్యాంటిన్ ఏర్పాటు జరగబోతుందన్నారు. చెరువు కట్టకు రెండు వైపులా రూ.20 లక్షలతో స్వాగత ఆర్చీల నిర్మాణం కోసం ఇటీవల ఎమ్మెల్యే భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఆర్చీ నిర్మాణంతో కార్లు, ట్రాక్టర్లు, ఇతర చిన్న వాహనాలు, బైకుల వంటి వాహనాలు రాకపోకలు సాగించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, పెద్ద వాహనాలు మాత్రం కట్టపై రాకపోకలు సాగిస్తే చెరువు కట్టకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. కనీసం ఆ మాత్రం అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు ఆర్చీల నిర్మాణం నిలిపేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం వారి అవివేకమన్నారు. సమావేశంలో పరశురాం, మహేష్ పాల్గొన్నారు.

ప్రేమామృతాన్ని పంచిన మానవతామూర్తి థెరిస్సా

- ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నిస్సహాయులకు, నిరుపేదలకు ప్రేమామృతాన్ని పంచిన దైవదూత, మానవతా మూర్తి మదర్ థెరిస్సా అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు మదర్ థెరిస్సా 115వ జయంతిని నిర్వహించా రు. గిరి రాజాచారి, బాలేమియా, కురుమయ్య, శ్రీనివాసులు, ఉత్తరయ్యపాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

వనపర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసింహ కాలనీలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో సమస్యలపై సర్వే నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. లలిత, సుశీల పాల్గొన్నారు.

చల్లంగా చూడు పోచమ్మ తల్లీ..

- ఘనంగా బోనాల పండుగ



నర్సింగాపురంలో బోనాలతో మహిళలు

మదనాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగాపురం, నెల్విడి, కొన్నూరు, దుప్పల్లి, దంతనూరు, శంకరంపేట, తిర్మలాయపల్లె గ్రామాల్లో పోచమ్మ దేవతకు మహిళలు మంగళవారం బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు, వాయిద్యాలు, డోలు శబ్దాలతో బోనం నైవేద్యంగా సమర్పించారు.

కొత్తకోట : మండలంలోని రామకృష్ణాపూర్, నాటవెల్లి, మిరాసిపల్లి, విలియంకొండ, వడ్డెవాట గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు.

వీపనగండ్ల : మండల కేంద్రంలో పోచమ్మ కోట మైసమ్మ బోనాలను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. పెబ్బేరు మునిసిపాలిటీ, పెబ్బేరు మండలంలోని రంగాపురంలో బోనాల పండుగ నిర్వహించారు.

పాన్‌గల్/ చిన్నంబావి : మండల పరిధిలోని బెక్కెం పెద్ద దగడ గ్రామాల్లో, పాన్‌గల్ మండల పరిధిలోని శాఖాపూర్, అన్నారం, దావాజీపల్లి, బుసిరెడ్డిపల్లి, మాధవరావుపల్లి, చిక్కేపల్లి, కేతేపల్లి, కొత్తపేట, మహ్మదాపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సుకులమ్మ బోనాలను నిర్వహించారు.

ఖిల్లాఘణపురం : మండలంలోని సోలీపూర్, ఉప్పరిపల్లి, మానాజీపేట, షాపూర్, అల్లమాయపల్లి, సల్కెలాపూర్, తిరుమలాయపల్లి, కమలొద్దిన్‌పూర్‌లో బోనాల పండుగ నిర్వహించారు.



వీపనగండ్లలో..



సోలీపూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు